# ఆధునిక మానవునికి ఒక జీవన విధానము

ఈ సృష్టిలో ఎంత జనాభా కలదో అన్ని జీవనవిధానములు కలవు. కానీ రెండుమాత్రమే ముఖ్యముగా ఎంచదగినవి. ఒకటి ప్రకృతికి అనుగుణముగా జీవించుట, రెండవది జీవాత్మననుసరించి జీవించుట. మానవజీవితమునకు ఈ రెండింటిలో దేనికీ పూర్తి అనుగుణముగా జీవించు సమర్థత లేదు. ప్రకృతికి అనుగుణముగా అనిన పామరునిగా లేదా క్రమశిక్షణ లేక, కోరిక మరియు పశుప్రవృత్తిగల వ్య క్తిగా అర్థము చేసుకొనవచ్చును. పూర్వకాలమునుండి యిటువంటి ఒక అభిప్రాయమున్నది. ప్రకృతి అనగా యింకొక దృష్టిలో మానవులందరినీ ఒకేవిధముగా భావించు దివ్యత్వస్థితి. దానినుండి మానవులందరికీ సమన్యాయమనే భావములు ఉదయించినవి. మానవులు యేవిధముగాను స్వేచ్ఛను కోరలేదు. ఎందుచేతననగా అదిలేకనే ఐకమత్యముతో కూడిన జీవితము గడుపుటకు సంఘము ఎంతో అవకాశము యిచ్చినది. ఇతరులతో తనను తాను సరిసమానముగా భావించి సోదరభావము కోరుకొనినపుడు స్వేచ్ఛగా నుండెదరు. ఈ సోదరభావము సరిసమానులు కానివారిలోనుండదు. ఏవిధముగానైనా ప్రకృతికి రెండుకోణములు కలవని మనము తెలుసుకొనినాము. ఒకటి జీవితములోని ప్రాథమిక అవసరములకు పోరాటము చేయుట, మరియొకటి ఇటువంటి పోరాటములకు చలించని ప్రశాంతమైన జీవితము గడుపు శకమునకు ఎదురుచూచుట.

పోరాటముతోకూడిన జీవన విధానమును అధిగమించుటకు సమానత్వము మరియు సోదరభావములను ఆదర్శములను ప్రయత్నించినపుడు ప్రకృతికి అనుగుణమైన సంస్కృతిగల యుగము ఉదయించినదని మనము చెప్పెదము. సంస్కృతి, సోదరభావము మరియూ స్వేచ్ఛాయుతమైన మంచి విలువలకు పట్టముగట్టి శాంతియుతమైన దివ్యత్వస్థితికి చేర్చుటకు నిరంతరము పోరాటము సలుపుచునే యున్నది. వేరుమాటలలో చెప్పవలెనన్న విడదీయు శక్తులను, జీవాత్మ యొక్క విలువలతోకూడిన శక్తియుక్తులతో అధిగమించు ప్రకృతియొక్క నిరంతర పోరాటముగా చెప్పవచ్చును. భారతదేశములో గతకాలములోని జ్ఞానులు దీనిని పర-ప్రకృతి లేదా ఉన్నత స్వభావము మరియు అపర-ప్రకృతి లేదా నిమ్నస్వభావముల నడుమ పోరాటముగా వర్ణించిరి. ఉన్నత స్వభావమును దైవము లేదా పరబ్రహ్మతోను,

నిమ్నస్వభావమును మన ప్రాపంచిక జీవితావసరములతోను వెంటనే సరిపోల్చక పోవచ్చును. ఉన్నత స్వభావము సమత్వస్థితిలో నుండుననియు, నిమ్నస్వభావము అసమత్వస్థితి లేదా భిన్నత్వము మరియు విడదీయు స్థితిలో నుండునని మనము అర్థము చేసికొనుటకు వారుకూడా సహాయపడిరి. ఇది అనగా నిమ్నస్వభావము లేదా అసమత్వ స్థితి (మాథ్యూ ఆర్నాల్డ్ చెప్పినట్లు) ఒక అరాజక స్థితి. మొదటిది అనగా ఉన్నత స్వభావము లేదా సమత్వస్థితి సంస్కృతియొక్క పరిపూర్ణమైన స్థితి. సంస్కృతియే ఉన్నతమైన భావములవైపు మళ్ళించు ఒక విధానము.

మన నాగరికత లేదా ఆధ్యాత్మిక విలువలతో ఉన్నతమైన స్వభావములను అలవరచుకొను సదవకాశము ఆధునిక మానవునికి లేదా ఈ ఆధునిక ప్రపంచములో నివసించు మానవునకు అందుబాటులో నుండుట అనుకూలమైన అంశము. అనేక మత సంబంధమైన సంస్థలు మతము మరియు ఆధ్యాత్మికమైన విలువలను స్ఫూర్తితో అలవరచుకొనుటకు తగిన వాతావరణము కల్పించినవి. మానవుడు తనలోని పశుప్రవృత్తులైన కలహము, వేర్పాటు తనము, అహంకార స్వభావములు క్రూరత్వముతో కూడిన జీవనవిధానములను మచ్చిక చేసుకొని తనవారితోనే గాక యితరులతోకూడ ఆవిధముగనే ప్రవర్తించుటకు విస్తృతపరిధిలో ఉన్నతవిలువలను ప్రతి మతము కల్పించినది. మతపరమైన ఆదేశములు ప్రజా జీవితములో అనేక అనుచిత ప్రవర్తనలను నిషేధించినవి కాని అంతర్గత లేదా వ్యక్తిగత జీవితమును మలచుటలో నిదానించి వెనుకబడినవి. కొన్ని విషయములలో యిది వేరుగా పరిణమించినది. తన వ్యక్తిగత జీవితములో కట్టుబాట్లతో తనను తాను అదుపులో నుంచుకొనవచ్చును గాని ప్రజాజీవితములో చాలామంది క్రూరముగా కాకపోయినప్పటికి ఉన్మాదులై పశువులుకూడా సిగ్గుతో తలదించుకొను దోషపూరితమైన ప్రవర్తన కలిగియుండిరి. భయముతోను మరియు పగతోను మానవులు ఎంత నీచమైన ప్రవర్తనకు లొంగిపోయినారో యుద్ధములు మన కళ్ళముందుంచును. మనిషి ఏవిధముగాను తన పశుప్రవృత్తిని మార్చుకొని దానిని అణచలేకపోయినాడు. ఐతే మానవుడు నేరసంబంధమైన న్యాయమును నెలకొల్పుటలో చాలావరకు ఫలితమును సాధించినాడు కాని పౌరసంబంధమైన న్యాయమును నెలకొల్పుటలో అంతగా ఫలితమును సాధించలేదు. జాతీయ ఆందోళనా సమయములలో, అవి

అంతర్గతమైనను లేదా బాహ్యామైనను, మర్యాదతోకూడిన పద్ధతులకు స్వస్తి పలికి, ఆటవిక న్యాయము కాకపోయినప్పటికి, మానవుడు కొన్నిటిలో విచక్షణతోను మరికొన్నిటిలో విచక్షణలేక ప్రవర్తించుచున్నాడు. మానవుడు స్వవిషయములోను లేక సామూహిక విషయములలోను, వ్యక్తిగతమైన లేదా సామాజిక విషయములలోను వివేకము కలిగియుండుటనునది మందగమనముతో సాగుతూ, విపత్కరమైన పరిస్థితులను ఎదుర్కొనుచున్నది. అందువలన ఉన్నతమైన మరియు నిమ్నస్వభావములు, దైవము మరియు పిశాచములవలె వాటి వైఖరులలో విరుద్ధభావములు కలిగియున్నవని చెప్పబడుచున్నవి. వీటి రెండిటినడుమ సమన్వయమును కలుగజేయుట బహుకష్టము. అనేక మతసంబంధమైన సంస్థలు వివేకముగానో లేదా అవివేకముగానో ఆతృతతో ఈ రెండు స్వభావములను వ్యతిరేకమని తలంచి, నిమ్నస్వభావము నిర్మూలించవలెనను ప్రతిజ్ఞ చేసినారు. కానీ ఈ నిమ్నస్వభావమును నిర్మూలించుటకు వారు నిమ్న పద్ధతులనే అనుసరించిరి. ఉన్నత విలువల ముసుగులోని మూర్ఖత్వము, గొర్రె చర్మము ధరించిన తోడేలు వలె, యోగి దుస్తులలో దాగియున్న కిరాతకుని వంటిది.

మనముందు రెండు మార్గములు వుండినవి. ఒకటి నిమ్న వైఖరులకు లోబడిన సమాజమునుండి మనిషి దూరముగానుండుట. రెండవ విధానములో మానవునిలోని పశుప్రాయమైన లక్షణములతో సహేతుకము మరియు, తార్కికముగా పోరాడి, మానసిక మరియు సామాజిక ఆలోచనాసరళిలో మార్పు తీసుకొనివచ్చుట. మొదటి విధానము ప్రతి మతములోను సన్యాసి వ్యవస్థకు దారితీసినది. రెండవదానిలో బోధనా సంస్థలు, ఆశ్రమములు, విహారములు వెలసి ధర్మశీలత, న్యాయనిష్టలతోకూడిన ఆలోచనలతో పరస్పరము సహకరించుకొను ఉత్తమమైన విలువలను పెంపొందించు హేతువాదములతో, మానవునికి ప్రయోజనకరమైన నిగ్రహశక్తిని తనంతతాను పెంపొందించుకొనుటవలన సమాజములో మార్పునకు దారితీసినది. విద్యను బోధించు పద్ధతులలో వైరాగ్యము చేర్చుటకు ప్రయత్నము చేయుటవలన, విద్య సన్యాసులు మరియు వారి మతముల అధీనములోనికి పోయినది. ఈ విధముగా హేతువాదము సన్యాసియొక్క సంకల్పమునకు అనుగుణముగా మలచబడినది. వాస్తవముగా మానవునిలోని యింద్రియజనిత జ్ఞానమును మరియు పశుప్రవృత్తిని మార్పుచేయు

సంకల్పముతో ఆధ్యాత్మిక ముక్తికోసము మరియు వివేక విశిష్టతకు, సామాజిక జీవితమును తప్పక త్యజించవలెనను మూఢనమ్మకము మనలో కలిగించిరి. సన్యాసుల కార్యరంగములు విస్తరించుటవలన వారి నీతి సూత్రములు మరియు సామాజిక మనోవిజ్ఞానము ఉన్నతమైన విలువలకు మరియు ఆధ్యాత్మిక వికాసమునకు సంబంధించినవిగా చెప్పబడి, యింకను నిమ్న వైఖరులకు సంబంధించినవి అనేకము రూపొందించబడినవి. షా చెప్పినటుల, క్రైస్తవేతరులను క్రైస్తవములోనికి చేర్చుటవలన క్రిస్టియన్లను భ్రష్టు పట్టించు అనుకోని పరిణామమునకు దారితీసినది. ప్రస్తుతము ప్రపంచములోని రాజకీయ మరియు జాతీయ జీవనములోని వారి స్వానుభూతులవలన మరియు సంస్థలవలన బయట పెట్టిన విషయమేమనగా, ఏ సంస్థలు అవినీతిని రూపుమాపుటకు వాగ్దానము చేసినవో దానికి బదులుగా అవియే చిన్న ఆధ్యాత్మిక అవినీతి కేంద్రములుగా మారుచున్నవనునది ఆందోళన కలిగించుచున్న విషయము. ఇది ప్రస్తుత కాలములోని మేధావులకు ఆందోళన కలిగించు ముఖ్యమైన అంశము. ఇది దురదృష్టవశమున మానవవైఖరి స్వభావమే అవినీతియను దృఢమైన విశ్వాసమునకు దారితీసినది. దివ్యత్వముతో కూడిన జీవనమునకు పూర్తిగా మరలించవలెనను నిస్వార్థమైన ప్రయత్నములెన్ని చేసినను తిరిగి పశుప్రాయమైన వైఖరిలోనే రక్షణ కలదని దానివైపునకే మరలిపోవుచు అందులోనే కొనసాగినవి. భ్రమలతోనిండిన సాధువులు మరియు సన్యాసులు విపరీతమైన ఆదర్శవాదముతో ఆనందమే ఉత్తమమైన పురుషార్థమని చేయు బోధన, ఆధునిక మానవునియొక్క చిత్తభ్రమకు ఒక ముఖ్యమైన కారణము.

రాజకీయ, సామాజిక జీవితములో అందరికీ సమన్యాయమనే వాదము పట్టము కట్టుటకు నిరంతర ప్రయత్నము చేసినను ఫలితము శూన్యమనునది స్పష్టము. వాదోపవాదములు ఎక్కువైనపుడు అచట కపటముతోకూడిన అవివేకము ప్రతిబింబించును.

వివేకముతోకూడిన వాగ్యుద్ధములను లేదా కలహములను మానుకొనుట యనునది ఒక గొప్ప విజయము. సమావేశములు ఏకాభిప్రాయమును కలుగజేసి ఒకవిధమైన శాంతిని చేకూర్చవచ్చును. అయినప్పటికీ అందరూ ఈ విధానమును అంగీకరించరు.

శాంతిని చేకూర్చుటకు యిద్దరి అవసరమున్నది కాని దానిని భంగపరచడానికి ఒక్కడు చాలు. ఆవిధముగా జాగుచేయు యుక్తులు లేదా సభ్యమైన సమావేశములకు అతీతముగా మనలను బలవంతముగా పోవునట్లు చేసినారు. ఎందుచేతననగా వీటిలో సత్యము లేదా నిజమైన న్యాయమును స్వార్థము అధిగమించును. మన దృక్పథమును సమాధానపరచుకొనుట సత్యము కాదు. అది మానవునిలోని అంతరాత్మ ప్రబోధమునుండి ఉదయించు పద్ధతులవలన వృద్ధిచెంది ఆతనిని మేల్కొలుపును. ఏమైనప్పటికి మానవుడు తన మేలుకొరకు ఆతని ప్రవర్తనలోని వైఖరులలో మార్పును కోరుచున్నాడు. ఈ విధముగా కోరుకొనుట నిరంతరమైన అలవాటుగా మారినపుడు ఎంతతీవ్రమైన ప్రేరేపణలు ఎదురైనను దీనిని ప్రపంచములోని అందరూ అనుసరించు సమయమును మనము ఊహించవచ్చును.

నేను చెప్పిన విధముగా ఆధునిక మానవునకు అనేక పద్ధతులు యివ్వబడినవి. గాంధేయ జీవన విధానము; పశుప్రాయమైనవిగా వారు వర్గీకరించిన దౌర్జన్యకరమైన విధానములను పూర్తిగా విసర్జించి, శాంతియుతమైన, సహేతుకమైన జీవితమునకు అంకితమగుట. శ్రీ అరబిందుని అధిమాసిక లేక అధిమనస్సు పరిణామం; ఉన్నతమైన మనస్సును ప్రతివ్యక్తిలోనికి తీసుకొనివచ్చుటవలన ఆతను విశ్వము అధిమనస్సు లేక విశ్వ చైతన్యస్థితికి సంబంధించిన ఆలోచనలు మరియు ధర్మములననుసరించును. శ్రీ రామకృష్ణ- వివేకానందుల పరంపర; మానవసేవ చేయుచూ ఆతనిలోని దైవమును సేవించుకొనుట. మానవుడు ఈ ప్రపంచములో ఆతను సమాధాన పడుటకు కష్టతరమైన ప్రాపంచిక మరియు సామాజిక పరిస్థితులకు లోబడి ఒక పరాయివానిగా జీవితము గడపకుండా, అనేక విధానములు సూచించబడినవి. కవులు లేదా అమరవీరులందరూ, ఏదీ మినహాయింపులేకుండా, అన్ని సంస్థలలోను పనిచేయుచున్న పశుప్రవృత్తులైన నిరంకుశత్వ పోకడలపై వారి ప్రభావము చూపలేక పోయిరి. మానవునిలోని అంతరాత్మశోధన అనునది ఒక శాశ్వతమైన ప్రక్రియ. గతములో ఇక్కడొకనికి మరియు అక్కడొకనికి అది సాధ్యమైనది. కానీ ఈ సమస్య యిప్పుడు అందరినీ వేధించుచున్నది.

విజ్ఞాన శాస్త్రము యిది సాధ్యమగునట్లు చేసినది. ఆత్మలో ఏమున్నది? “బ్లాక్

గర్ల్స్ సర్చ్ (black girls search)" అను బెర్నార్డ్‌షా పుస్తకము లేదా డాక్టర్ యుంగ్ యొక్క "సర్చ్ బై ఎ మోడరన్ మ్యాన్ (search by a modern man)" అనునవి కాల్పనికమైనవి మాత్రమే కావు. అవి అపాయకర పరిస్థితులలోనున్న ఆధునిక మానవుడు తన వికలమైన మనస్సుతో పోరాడుచున్నప్పుడు పరిష్కారములని భావించిన విపత్కర పరిస్థితులు. విజ్ఞానశాస్త్ర హేతువాదయుగము (the scientific pragmatic age) దిగ్భ్రమ కలిగించు విజ్ఞానము మరియు సాంకేతపరమైన సమస్యలను పుట్టించి, అంతకు ముందున్న పరిస్థితిరైయెన దైవమునకు మనవి చేసుకొనుట అనునది అసాధ్యమని కల్పించినది. ఇప్పుడు మనము నాస్తికులము లేదా భౌతిక వాదులమైనాము. దైవము లేదా దేవతలు వున్నను ముక్తి తనలోనే వున్నదని మానవుడు భావించునట్లు చేసితిరి. తాను భావించినంత కష్టమైనది కాని, తన కనీస అవసరములను పొందుచూ, తనతోటివారితో న్యాయము కలిగి ప్రశాంతమైన జీవితమును గడుపుటకు తనపైనే తాను ఆధారపడుట అను ఒకేఒకదానిపై ఆధునిక మానవుడు శ్రద్ధ కలిగియున్నాడు. మిగతావన్నియూ వట్టి భ్రమ కావచ్చును. విజ్ఞానశాస్త్రప్రకారము చెప్పబడిన ముందుచూపు, హేతువాదము మరియు అభివృద్ధి చెందుట అను అంశములతో కూడియుండిన జీవన విధానము ఆతనికి సరిపోయి యుండవచ్చును. అయినప్పటికీ విజ్ఞానశాస్త్రముయొక్క పరిధులు మానవుని వ్యక్తిత్వములోనే గోచరించును. ఆతని జీవితానంతరము లేదా మరణము తరువాత కల ప్రధాన సమస్యలు ఆతనిలోని అంతరాత్మ మరణానంతర జీవితములో దాని ఛాయను ఆతనిముందుంచి సందిగ్ధములో పడవేయును. ఇవి ప్రస్తుతము కొందరికి వర్తించక పోవచ్చును. కానీ గతములో యిది సన్యాసుల జీవితములలో లేదా చెప్పాలంటే బాధ్యతలను తప్పించుకొని పారిపోయినవారిలో యిది సర్వసాధారణమైనది. ప్రస్తుతము విజ్ఞానశాస్త్రము దీనిని ఎదుర్కొను మాట అటుంచి దీనికి యింకనూ తగిన పరిష్కారమును సూచించలేకపోయినది. మన తోటి ప్రపంచము చాలా పెద్దది. మరణము మనకు పెద్ద సమస్య కాదు. అది మన సమస్యలకే కాకుండ యితరుల సమస్యలకు కూడ ఒక పరిష్కారముగా కనబడుచున్నది. ప్రత్యర్థులను అంతమొందించుట, పనికిమాలిన వాటిని వదిలించుకొనుటవలె ఒక త్వరితమైన పరిష్కారముగా కనబడుచున్నది.

ఇది తప్పకుండా నీచమైన పరిష్కారము. మానవులు మరణానంతరము ఉన్నతమైన జీవితములోనికి అడుగు మోపెదరని, అత్యంత మనోహరమైన ప్రపంచము వారి నూతన నివాసమగునని మతములో వాగ్ధానము చేయబడినది. వాస్తవముగా దైవము అచట రాజ్యపాలన చేయునని చెప్పబడినది. ఏ మతమైనను అన్ని పరిస్థితులలోను ఒక మంచి జీవితమును గడుపుచూ నీతి మరియు ఉన్నతమైన స్వభావములతో జీవితము గడిపినవానికి ఆనందకరమైన మరియు స్వేచ్ఛాయుతమైన ప్రపంచమునకు దారితీసి మంచి జీవనమును ప్రసాదించునని లేదా అన్ని దుఃఖములనుండి విముక్తి కలిగి సుఖము కలుగునని వెల్లడించుటకు శ్రమపడినది. ఈ విధమైన ఆశాభావన కేవలము కాల్పనికమైన కోరికను నెరవేర్చుకొనుటగా పరిగణించడమైనది. ఈ ప్రపంచమును దివ్య ప్రపంచముగా మార్చుటకు గట్టి ప్రయత్నము చేయుట తప్ప మనకు యింకేమైనా వున్నదా? అదే సంగ్రహముగా మనముందున్న సమస్య మరియు ఆధునిక మానవునికి ఒక సవాలు. తక్కువ కాలము నిలుచు ఆశలు, నిమ్న మైన స్వభావములవలన నిశ్శబ్దముగను మరియు నిర్దాక్షిణ్యముగను భగ్నము చేయబడును.

నిమ్న మైన స్వభావము దానంతట అదియే నియంత్రించబడి జీవితము ముగిసిన పిమ్మట భవిష్యత్తును తెలుపగల విధానమును కనుగొనుటయే మనముందున్న ఏకైక మార్గము. చావు భయంకరమైనది కావచ్చును కాని జీవితము తన అంతఃప్రేరణతో దానిగురించి తెలియజేయుటవలన, మరణ లోకములను ఆహ్వానించెదము. ఆధ్యాత్మిక మార్గము తప్పక ఈ రహస్యమును తెలియజేయును. గతించిన అనేక మత సిద్ధాంతములు ఏవిధముగానూ దీనికి సరియైన పరిష్కారమును అందించలేకపోయినవి. ఈ ప్రాపంచిక సుఖములను విపులీకరించి దానిచేత వాటిని శుద్ధిచేసినామని తలపోయు కవులయొక్క స్వప్న జగత్తులో అవి చాలావరకు అంతమైనవి. సత్‌తత్వప్రాప్తికి కవిత్వము ప్రత్యామ్నాయము కాదు. దానికి యివి ఏవిధముగాను ప్రామాణికమైనవిగా పరిగణింపబడవు.

జీవన్మరణముల రెండింటిలోను మనతోనుండు సత్‌తత్వముయొక్క మూలమునకు మనలను అనుసంధానించుకొనుటయే బహుశా మనకున్న ఒకేఒక మార్గము. ఆ మూల

సత్‌తత్వముతో అనుసంధానించు విధానమును వివరించునదే యోగముగా చెప్పబడినది. ఇప్పటివరకు యోగసాధనావిధానములో వాస్తవముగా అనుసంధానము చేయుటకంటే బాహ్యమైన ఆడంబరములకే ఎక్కువ శ్రద్ధ వహించుచున్నారు. ఇప్పుడు యోగము అని చెప్పబడు దేనిలోను దైవముతో అనుసంధానించు పద్ధతులు తీసుకొని రాబడలేదు. స్వార్థరహితమైన సేవ లేదా లోతైన ఆలోచనావిధానము లేదా అవగాహన చేసుకొనుట లేదా కేవలము భక్తి లేదా పారిభాషిక పదములను మార్చుకొనుచుండుట మాత్రమే సహాయపడలేదు. మతపరమైన, నిగూఢమైన కర్మకాండలు ఫలితములను చూపలేదు. ప్రస్తుతము యోగము కృత్రిమమైన విధానములకు ఎంతగా దిగజారినదనగా వశీకరణము లేదా విచిత్రమైన ప్రవర్తనలకు యోగము అను పేరు వాడుకైపోయినది. అసాధారణమైన వింత ప్రదర్శనలన్నియూ యోగముగా చెప్పుకొనుచున్నారు. ఇది చాలా దురదృష్టకరమైన విషయము.

బాహ్యమైన ఆడంబరములను కోరుకొనుట లేదా వింతలకు ఆరాటపడుట మానుకొని అనంతత్వముతో అనుసంధానమగు ఒక పద్ధతి మన వైఖరులలోను లేదా చైతన్యములోను మార్పులు తీసుకొనివచ్చు మంచి అవకాశము కలదు. షాజహాన్‌పూర్ వాస్తవ్యులైన శ్రీ రామచంద్రజీ మహారాజ్ వారు తమ నూతన రాజయోగ విధానములో దీనినే ఖచ్చితముగా మనముందుంచినారు. ఇది శాస్త్రీయమైన, నిరూపించగలిగిన సులువైన మరియు సరళమైన విధానము. అనుసంధానము పిదప సాధకుని హృదయములోనికి దివ్యచేతనము లేదా అనంత భావనా సంపత్తి ప్రసారము చేయబడును. అది యిహ మరియు పరములలో జ్ఞానమును కలిగించును. ఇది ఆదిమూల చేతనముగా భావనచేయు పర లేదా అనంత చేతనత్వముయొక్క ప్రసారము. ఇదియే జీవుడు దేనికైతే వెడలిపోవుచుండునో అది వాస్తవమని గుర్తించబడిన చావు పుట్టుకలను కలుగజేయును. ఇది కొందరి వినోదమునకు, అనేకమంది దుఃఖమునకు మూలమైన చావు పుట్టుకల మధ్య సంవాదమునకు అతీతమైనది. ప్రాణ లేదా జీవముగా పిలువబడు ఈ అతీతమైన భావనా సంపత్తి నిమ్నమైన స్వభావమును స్వాభావికమైన అతి ఉన్నతమైనదిగా మలచగల శక్తి గలిగి, మానవుని శరీరములోని యింద్రియములు మరియు మనస్సునకు ప్రశాంతమైన స్థితిని కలుగజేయును. ఆలోచనారహిత స్థితి లేదా శూన్యస్థితి మన లక్ష్యముగా కాక, భావనా సంపత్తి, వ్యక్తిగత, విశ్వ మరియు పరములకు

అతీతమైన సత్‌తత్వముయొక్క అనుభవమై యుండవలెను. ఇది సాధ్య మైనదే. ఎందువలననగా ఈ సృష్టిమూలములో ఈ మనస్సు మరియు అహంకారము, దేనివలనైతే మనగలుగు చున్నవో, దేనినైతే అచేతనమైన మరియు స్థూలమైన స్థితిలో మాత్రమే తెలుసుకొనగలుగుచున్నవో, దానిలోనివే. మానవ శరీరములో ఒక్కసారి యీ అంతర్గతమైన సత్‌తత్వమును ప్రవేశపెట్టి దానికి స్పందించునటుల చేయబడినచో అప్పుడు అది ప్రశాంతతగా మన గ్రాహ్యశక్తికతీతమై అనుభవములోనికి వచ్చును. అదియే దివ్యత్వము. అనంతత్వము శాస్త్రమును గాని మానవ దేహమును గాని కాదనదు. వాటిని అతి ఉన్నత స్వభావములు మరియు తన దివ్య ధర్మములైన ప్రశాంతత, సత్ తత్వము, సమతాభావము మరియు సమర్థతలను విధులను నిర్వహించు సాధనముగా చేసుకొని మరల తిరిగి స్థూలత్వమునకు తీసుకొని రాదు.

ఇది మూఢవిశ్వాసము లేదా అనుష్ఠానములతో కూడిన పద్ధతి కాదు. నిమ్న స్థితిలోని దాని ప్రతిరూపమైన స్థూలత్వమును ఖండించుచూ పరిశుద్ధమైన జీవాత్మకు సంబంధించిన పరమార్థ సాధనము.

ఉన్నతమైన విలువలను గుర్తించు మానవులందరు దివ్యత్వమును హృదయములో ప్రవేశపెట్టగలుగు విధానము తెలిసిన సాధకుల సహాయముతో శిక్షణ పొంది దీనిని సాధన చేయవచ్చును.

(పూజ్య డాక్టర్ కె.సి.వరదాచారి గారి Complete works of Dr.K.C.Varadachari (Volume -Ten) లోని "A way of life for the Modern man" అను ఆంగ్ల వ్యాసమునకు తెలుగులో స్వేచ్ఛానువాదము. పాఠకులు మరింత సరియైన అవగాహనకు ఆంగ్లవ్యాసమునే ప్రామాణికముగా తీసుకొనవలసినదిగా మనవి చేసుకొనుచున్నాను. - వి.రామం)